# వైరాగ్య స్థితి

**ఫో**న్ మోగింది. తీశాను.

మా శారదత్తయ్య.

"రేపు మంగళవారం" అంది.

"అవును ఎల్లుండి బుధవారం!" అన్నాను.

"ఏడిశావులే వెధవ తెలివితేటలూ నువ్వూనూ, రేపైనా వస్తున్నావా?"

కోప్పడింది.

"రేపు కుదరదేమోలే వచ్చేవారం చూద్దాం!" అన్నాను.

"ఇప్పటికి చాలా రోజుల్నించి వూరుకున్నాను. ఇక లాభం లేదు. రేపు రాకపోతే కాళ్లు చేతులూ కట్టేసి లాక్కుపోతా!" అంది ఖచ్చితంగా.

వరుసకి అత్తయ్యేగానీ దానిదీ నా వయసే. కాకపోతే చుట్టరికం వంక పెట్టుకుని నా మీద పెత్తనం చెలాయిస్తూ వుంటుంది. నేనూ వినయంగా వింటూ ఉంటాను. నేను ఊళ్ళన్నీ ఊరేగి ఇక్కడికి చేరానుగానీ అది మొదటినుంచి ఇక్కడే పాతుకు పోయింది.

నేనిక్కడికి వచ్చిన కొత్తల్లో "ఏవిటీ నీ దినచర్య?" అని అడిగింది!

"ఏవుందీ? తెల్లవారుతూనే ఆయన వాకింగ్‌కి వెళ్తారు. నేను ఇల్లొదిలిపోతే పాలవాళ్ళూ, పనివాళ్ళూ వచ్చి తిరిగిపోతారు కాబట్టి నేను ఇంటి చుట్టూ తిరుగుతాను.

"ఆయనొచ్చాక కాఫీ తాగుతాం. పేపరు. మరోసారి కాఫీ. స్నానం అయ్యాక టిఫెనూ, కాఫీ, ఆ తరవాత ఆయన లెఖ్ఖా డొక్కా చూసుకుంటారు. నేను వంట చేస్తాను. భోజనాలు, నిద్ర, నిద్ర లేచి కాఫీ.

"ఆయన టి.వి. చూస్తారు. నేను టిఫిన్ చేస్తాను. టిఫిన్ తిని కాఫీ తాగుతాం. ఇద్దరం బజారుకెళ్ళొస్తాం. ఆయన ఆరేడు న్యూస్‌లు చూస్తారు. నేను వంట చేస్తాను. భోంచేసి పడుకుంటాం" అని దినచర్య చెప్పాను.

నా వంక అదోలా చూసింది. "శ్రీ రమణగారు రాసిన మిథునం కథలో అప్పదాసుగారూ, బుచ్చిలక్ష్మిగారూ లాగా దినం అస్తమానం తిండం తాగడం తప్పించి ఓ దేవుడూ, భక్తీ లేవా మీకు?" అని అడిగింది.

"అయ్యో చూశావా మర్చేపోయాను. స్నానం చెయ్యగానే ఆయన పూజ గదిలోకి వెళ్ళి దీపాలు వెలిగించి పూలు పెట్టి ఆయన కొచ్చిన స్తోత్రాలు చదువుకుని బయటికొస్తారు. నేను వెళ్ళి నా కొచ్చిన స్తోత్రాలు అన్నీ చదువుకొని ఏ పండో ఫలమో నైవేద్యం పెట్టి హారతిస్తాను" అని తప్పు దిద్దుకున్నాను.

"పోన్లే కొంతలో కొంత నయం. కానీ ఇది చాలదు సాధన చెయ్యాలి. ఇహం వదిలేసి పరం గురించి పాకులాడాలి!" అంటూ ఏవిటేవిటో చెప్పింది విన్నాను.

ఆ మాటకొస్తే ఈ విషయాలు గతంలో చాలామంది చెప్పారు. నేను మెడిటేషన్ చెయ్యాలని గట్టిగానే ప్రయత్నించాను. అదేం ఖర్మమో కళ్ళు మూసుకుంటే అత్తగారి వేధింపులూ, అమ్మ సాధింపులు గుర్తు వస్తున్నాయే తప్ప భగవంతుడి మీద దృష్టి నిలవదు.

ఆ మాటే చెప్తే శారదత్తయ్య మందలించింది. అదంతేనుట. పారిపోవడమే మనసు లక్షణంట. అట్లా పారిపోతున్న మనసుని లాక్కొచ్చి కూర్చోబెట్టాలంటే గురువు కావాలిట. తనకు గురువుగారుందిట. ఆవిడ దగ్గరికి నన్నూ తీసికెళ్తానని పోరు.

"టీవీలో బోలెడు ఛానల్సు వచ్చిన దగ్గర్నించీ కావలసినంత సమాచారం అందుతోంది. పుట్టమీద దొర్లే అమ్మవార్ని, కోడి బాబానీ, కొళాయి బాబానీ, టీవీలో చూసి భక్తి పోయి నవ్వొస్తోంది. ఇప్పుడు నీ గురువు గారు కూడా ఆ బాపతేనా?" అంటే లెంపలు వేసుకుంది నన్నూ వేసుకోమంది.

చాలా పవర్ వున్న మనిషట. నేను చెప్పడం ఎందుకు చూస్తే నువ్వే గ్రహిస్తావు. అని ఊదర పెడుతోంది. పోనీ చూసొద్దాం అని బయలుదేరాను.

ఇల్లు పెద్దదే. ఇంకా ఆ చివర ఏసి గదులనీ కట్టిస్తున్నారు. ఖాళీస్థలం నిండా రేకుల షెడ్లు పందిళ్లు. ఎకరాల కొద్దీ వుంది ఆవరణ. మంచినీళ్ళ కూలరూ. కాళ్ళు కడుక్కునే స్థలం, చెప్పుల స్టాండు వగైరా హంగులన్నీ వున్నాయి. ఓ పక్క రెండుమూడు దుకాణాలు ఉన్నాయి. పూసల దండలూ, శాలువాలూ, ఫోటోలూ అమ్ముతున్నారు.

కొంతమంది వాలంటీర్లు వున్నారు. మమ్మల్ని హాల్లోకి పంపించారు. హాల్లో ఆ చివరన పెద్దపాలరాతి అరుగు. దానిమీద ముఖమల్ సోఫా. దానిమీద ఆశీనులై వున్నారు అమ్మగారు.

మనుషుల దగ్గర ఏం మహిమలుంటాయిలే అనుకున్న నాకు ఆవిడని చూడగానే జ్ఞానోదయం కలిగింది. నిస్సందేహంగా ఏదో శక్తి వుంది ఆవిడకి.

ఎందుకంటే ఎండ మండిపోతోంది. ఈ చెవిగాడుపు ఆ చెవికి కొడుతోంది. అంత వేడిలోనూ జరీ ముద్దలావున్న మూరెడంచు పట్టుచీరె, మాచింగ్ జాకెట్టు వేసుకుంది. నగల షాపు మోడల్‌లా మెడనిండా హారాలు, చేతులకి గాజులు, ఇవన్నీ వేసుకుని కూడా చిరునవ్వు నవ్వుతోందంటే మహిమవుండే వుంటుంది.

భజన జరుగుతోంది. అదయ్యాక ప్రవచనం మొదలైంది. అందరూ నిశ్శబ్దంగా వింటున్నారు.

"అసలీ సృష్టి అంటే ఏమిటి? మానవ జన్మ పరమార్థం ఏమిటి? ఎక్కడినించి వచ్చాడీ ప్రాణి? ఎక్కడికి పోతున్నాడు?" సాగిపోతోంది ఉపన్యాసం.

నా గుండె తరుక్కుపోయింది. సాటి ఆడకూతురు. అస్తవ్యస్థాన పడిందంటే వింతేముంది? లోపలికి తీసికెళ్ళి ఆ నగలన్నీ ఒలిచి, చెంబుడు చన్నీళ్ళు పోసి నూలు చీర కడితే వేడి తగ్గి బుర్ర పనిచేసి సమాధానాలు తడతాయి ఈ ప్రశ్నలకి.

ఆ మాటే అంటే మండిపడింది అత్తయ్య "ఇటువంటి వెధవ్వేషాలు వేస్తూండు. రేపు పైకెళ్ళాక ఆ యమధర్మరాజు నిన్ను బూర్ల మూకుట్లో వేసి వేయిస్తాడు" అంది.

ఒక్క నిముషం భయం వేసింది. తర్వాత ధైర్యం వచ్చింది. నన్ను ఒక్కదాన్నే వేయించదు కదా! నాలాంటి వాళ్ళు చాలామందే వుంటారు. నలుగురితో నారాయణా, పదిమందితో పరంధామా! అదీ బానే వుంటుంది.

ఆ మాటంటే అత్తయ్య మళ్ళీ తిడుతుంది. అందుకే వూరుకున్నాను. కాసేపు గడిచాక ప్రవచనం అయిపోయింది. ఇక ప్రశ్నోత్తరాలు జరుగుతాయట.

మైకులో ప్రకటించారు. భక్తుల సందేహాలకు అమ్మగారు సమాధానం చెప్తారుట. అందులోనూ మూడు కేటగిరీలు. మొదటిది రెండొందల యాభైపెట్టి శాలువా కొంటే, సందేహం తీర్చి శాలువా కప్పుతారుట.

రెండవది. నూటయాభై ఇచ్చి పూసల మాల కొనుక్కుంటే సమాధానం చెప్పి దండవేస్తారు.

మూడవది. వంద పెట్టి ఫోటో తీసుకుంటే సమాధానం చెప్పి ఫోటో మంత్రించి ఇస్తారుట.

"నువ్వు ఏమైనా అడగాలనుకుంటే అడుగు" అంది శారదత్తయ్య.

"అమ్మగారి చేతులకి ఉన్న కెంపుల గాజులు బావున్నాయ్. ఎక్కడ చేయించు కున్నారో అడగాలనుకుంటున్నాను" అన్నాను.

"నీ బొంద. ఇటువంటి పిచ్చి ప్రశ్నలు కావు. పారమార్థిక విషయాలు అడగాలి. సమస్యలుంటే చెప్తే పరిష్కారం చెప్తారు" అంది రుసరుసలాడుతూ. ఆవిడ వేసుకోగా లేనిది నేను అడిగితే అపరాధమా?

ఆ భగవంతుడి దయవల్ల నాకే సమస్యలూ లేవు. వున్నదల్లా ఒకటే ఈ బరువు ఎలా తగ్గించుకోవాలా అనే సమస్య. ఆ ముక్క ఆవిడని అడుగుదామంటే ఆవిడే నాకు నాలుగింతలుంది. ఇంకేం అడుగుతాను? అందుకే నాకేం సమస్యలు లేవు అన్నాను.

శారదత్తయ్య పూసలమాల కొనుక్కుని క్యూలో నుంచుంది. నాకు విసుగేసి బయటికి వచ్చేశాను.

బయట పెద్ద చెట్టు వుంది. దానికింద అరుగుమీద కూర్చుని ఉన్నారు ఇద్దరు అమ్మాయిలు. చూస్తుంటేనే తెలిసిపోతోంది, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులని. నేనూ వెళ్ళి కూర్చున్నాను. పలకరించారు. మీరు అమ్మవారి శిష్యులా అని అడిగారు. కాదు, మా అత్తయ్య వెంట వచ్చాను అని చెప్పాను.

వాళ్ళు వాళ్ళ బాస్ భార్య అమెరికానించి వస్తే ఆవిడని తీసుకొచ్చారుట.

"అబ్బా అమెరికానించి వచ్చారా?" అని అడిగాను.

"రాకేం చేస్తారు? బాగా శఠగోపం పెట్టింది ఈవిడ" అన్నారు నవ్వుతూ.

ఏమిటో అర్థం కాలేదు నాకు. ఆ మాటే అంటే "చెప్తాం వినండి, మంచి టైమ్‌పాస్" అంటూ మొదలు పెట్టారు. ఆ మధ్య ఈ సదరు అవతారమూర్తులంతా అమెరికా వెళ్తే బాగా గిట్టుబాటు అవుతుందని సమ్మర్ రాగానే వలసలు వెళ్ళేవాళ్ళు. అక్కడి ఎన్.ఆర్.ఐ.లు వీళ్ళని నెత్తిన పెట్టుకుని చూసుకునే వాళ్ళు.

ఈవిడా అలానే వెళ్ళిందిట. మా బాస్, ఆయన భార్య అమిత మర్యాదస్తులు. వాళ్ళింట్లో వీళ్ళకి ఆతిథ్యం ఇచ్చారుట.

ఫిల్టరు కాఫీలు దక్షిణాది వంటకాలు, వాటితోబాటు, ఉత్తరాది వంటకాలు, ఇవన్నీకాక అమెరికాలో దొరికే పిజ్జాలూ బర్గర్లూ అడిగినవన్నీ కాదనకుండా పెట్టారుట.

శిష్యుల కాషాయవస్త్రాలు, అమ్మవారి కాషాయ నైటీలూ నోరెత్తకుండా ఉతికిపెట్టారుట. వీరింట్లో మకాం వేసి మిగిలిన వారిళ్ళకి పాదపూజలకి వెళ్తూ నెల్రోజులు కాలక్షేపం చేశారుట.

తిరుగు ప్రయాణం అవుతూ బాస్‌ని పిలిచి నాయనా నువ్వు కెంపుల హారం తీసుకుంటావా, పచ్చల పతకం తీసుకుంటావా అని అడిగారుట.

వద్దమ్మా నాకేం వద్దు అన్నారుట ఆయన మొహమాటపడుతూ, సరే అయితే రెండూ తీసుకో అన్నారుట అమ్మవారు.

వద్దన్నా వినడంలేదు ఏంచేస్తాను మీ దయ అన్నాడుట మా బాస్ సరదా పడి పోతూ!

వెంటనే రిసీట్ బుక్ తీసి ఫలానివారు కెంపుల హారానికి పచ్చల పతకానికీ ఇచ్చిన సొమ్ము లక్షాయాభై వేలు అని రిసీట్ రాసి ఆయన చేతులో పెట్టారుట వీళ్లు.

మా బాస్ కళ్ళు పచ్చబడ్డాయట. ఇదేం అన్యాయం తీసుకో తీసుకో అంటే నాకిస్తారేమో అనుకున్నానంటూ లబోదిబో మన్నాడుట.

"నీ చేతుల మీదుగా అమ్మవారికి సమర్పించుకునే మహద్భాగ్యం నీకు ప్రసాదించారు. అందుకానందించు" అని ఇరుకున పెట్టేసి డబ్బు తీసుకున్నారుట.

ఆ మరుసటి సంవత్సరం ఈవిడ వెళ్ళినప్పుడు మా బాస్ తప్పించుకు తిరుగుతుంటే వెతికి పట్టుకుని నాయనా యాగశాల తీసుకుంటావా? ఆలయగోపురం తీసుకుంటావా? అని పీక్కుతింటూంటే, నావల్ల కాదు అని ఏదో కొంత సమర్పించు కున్నారుట.

రాన్రాను అక్కడి మన వాళ్లూ విసిగిపోయారు. వీళ్లని ఎంటర్ టెయిన్ చెయ్యడం మానేశారు.

దాంతో పాపం వీసాలున్నా విమానం ఖర్చులు భరించలేక వీళ్ళంతా వేసవిలో కూడా స్వదేశాల్లోనే వుంటున్నారు.

స్వయంగా వెళ్ళలేకపోయినా ఫోన్లున్నాయి. ఫోన్లు చేసి హోమం చేస్తున్నాం, ఘృతం తీసుకుంటావా? సమిధలు తీసుకుంటావా? మహాకుంభాభిషేకం చేస్తున్నాం అన్నదానం చేసుకుంటావా? వస్త్రదానం చేసుకుంటావా? అని విసిగించడం మొదలు పెట్టారుట. మా వల్ల కాదంటే మీ ఇష్టం. మీకసలే గ్రహస్థితి బాగాలేదు. దివ్యదృష్టితో చూశారు అమ్మవారు. ఏదైనా సేవ చేసుకుంటే ఆపద గట్టెక్కుతుందని చెప్పాం అంటూ సెంటిమెంటల్ బ్లాక్‌మెయిల్ చెయ్యడం. అంతే పాపం వాళ్లకి నిద్రపట్టక అవస్థలు పడడం. అందుకే ఇప్పుడీవిడ వస్తూంటే ఇక్కడకు వెళ్ళి ఏదో సమర్పించుకుని ఇక

మా జోలికి రావద్దని చెప్పి రా అన్నాడుట బాస్. అందుకే ఆవిడ వచ్చింది” అంటూ ముగించారు ఆ సాఫ్ట్‌వేర్ పిల్లలు.

ఇంకా ఇటువంటి అవతారమూర్తుల గురించే కాసేపు కబుర్లు చెప్పుకొన్నాం. ఓ పక్కగా కలకలం. ఒకావిడ కాషాయాలు ధరించి నిద్రలో నడుచుకుంటూ వస్తోంది. వాలంటీర్లు ఆశ్రమవాసులూ తప్పుకొని దారి ఇస్తున్నారు. యోగిని మాత వస్తోంది అని వినయంగా నమస్కరిస్తున్నారు.

వాళ్ళల్లో ఒకరిని దొరకబుచ్చుకొని వివరాలు రాబట్టాం. పూర్వాశ్రమంలో ఆవిడ పేరు నరసమ్మగారుట. అమ్మగారి తొలినాటి భక్తుల్లో ఒకర్తె. అప్పట్లో ఇల్లూ పొలాలు వుండేవిట. సర్వం ఈ అవతారమూర్తికి సమర్పించుకుని ఇక్కడే వుండి పోయిందిట. మన లోకంలో వుండదుట. మేము చూస్తుండగానే వెళ్ళి ఒక చెట్టు కింద కూర్చుని, కాసేపు జపమాల తిప్పుతూ తనలో తనే ఏదో గొణుక్కుంటూ వింతగా ప్రవర్తిస్తోంది.

“ఇదంతా భక్తి పారవశ్యమేనంటారా?” అడిగాను ఆ పిల్లలని. “ఏం కాదు. ఉన్నదంతా వూడలాక్కున్న తర్వాత ఇంకేం మిగుల్తుంది వైరాగ్యం కాక? ఇదీ అటువంటి కేసే” అనేశారు ఆ పిల్లలు నవ్వేస్తూ.

అంతలోనే వచ్చింది మా అత్తయ్య.

ఈ మాల ఆయన మెళ్ళో వేస్తే షుగరూ ప్రెషరూ దెబ్బకి తగ్గిపోతాయని చెప్పారు అమ్మవారు. మందులు కూడా అక్కర్లేదన్నారు. నెలకోసారి అయిదువేలు పెట్టి పూజ చేయిస్తే చాలుట అంది సంబరపడిపోతూ.

మా అత్తయ్య కూడా ఆ యోగిని గారిలా పూర్తి వైరాగ్యస్థితికి చేరుకుంటుందేమో అని భయం వేసింది నాకు.

*విపుల మాసపత్రిక, ఫిబ్రవరి 2006*